

సీఎం సిటీ రౌండ్స్ రద్దు

● వార్ రూం నుంచే బాధితులకు పరామర్శ

భారీ వర్షాల కారణంతో నగరంలో సమస్య నెలకొన్న ప్రాంతాల్లో సీఎం సిటీ రౌండ్స్ చేస్తారని ప్రకటించారు. ఇందుకోసం విజయనగర పర్యటనలో ఉన్న డీసీఎం డీకే శివకుమార్ హుటాహుటిన బెంగళూరుకు చేరుకున్నారు. వారిద్దరూ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించాలని భావించారు. మరోసారి వర్షం కొనసాగడంతో సిటీ రౌండ్స్‌ను రద్దు చేశారు. బీబీఎంపీ కార్యాలయంలోని వార్ రూంకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.


వార్ రూం నుంచి బాధితులతో మాట్లాడుతున్న సీఎం


చామరాజపేట 5వ మెయిన్‌లో కూలిన చెట్టు


కంఠీరవ స్టేడియంలో..


కోరమంగలలో ఇళ్ల ముందు..

నగరం.. జలదిగ్బంధం..!


బన్నేరుఘట్ట రోడ్డులో ఫ్లై ఓవర్ కింద వర్షపునీరు

- జలమయమైన నగరం ● ఇళ్లు, ఆఫీసుల్లోకి నీరు
- 20 ప్రాంతాల్లో జనం విలవిల ● నేలకూలిన వృక్షాలు
- గోడకూలి మహిళ దుర్మరణం ● సీఎం సిటీ రౌండ్స్ రద్దు
- పాలకుల నిర్లక్ష్యంతోనే ప్రజలకు కష్టాలు: బీజేపీ

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం సెలయేరును తలపించింది. నైరుతికి ముందే వరుణుడు విజృంభించాడు. నెలరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నా పెను ప్రభావం చూపలేదు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి నగర ప్రజలు తల్లడిల్లారు. దాదాపు సగం ప్రాంతంలో జన జీవనం అస్తవ్యస్థమైంది. రోడ్లు, నదుల్లా ప్రవహించాయి. ఫ్లై ఓవర్లపై ప్రయాణించే పరిస్థితి లేకుండాపోయింది. అండర్‌పాస్‌లు మూతపడ్డాయి. రబ్బర్‌బోట్లు రోడ్డెక్కాయి. అనాథాశ్రమంలో వృద్ధులు బెంబేలెత్తారు. పరిశీలనకు ఎక్స్‌కవేటర్లపై ఎమ్మెల్యే పయనించారు. వర్ష బీభత్సం ధాటికి సీఎం సిటీ రౌండ్స్ అర్థాంతరంగా రద్దు చేసుకున్నారు. ఇదంతా కేవలం ఒక రాత్రి కురిసిన వర్షానికి బెంగళూరులో చోటు చేసుకున్న ప్రభావం ఇది. రాత్రి పొద్దుపోయాక ప్రారంభమైన వాన సోమవారం తెల్లవారుదాకా హోరెత్తించింది. కోరమంగల, మహదేవపుర, యలహంక, బొమ్మనహళ్ళి, సాయి లే అవుట్, ఈజీపుర, శాంతినగర్‌లలోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. ఉదయం నగరంలోని వివిధ ప్రాంతాలనుంచి ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వారాంతం ముగించుకుని మహదేవపురలోని చన్నసంద్ర వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే ఉద్యోగి హడావుడిగా వెళ్తుండగా ఒక్కసారిగా గోడ కూలడంతో శశికళ (35) దుర్మరణం చెందారు. యాదగిరి జిల్లా శహపురకు చెందిన ఆమె భర్తతోపాటు ఉపాధికోసం వచ్చారు. ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు.


జలమయమైన శాంతినగర్ సీసీబీ కార్యాలయం

జలమయమైన కార్యాలయాలు


విల్సన్‌గార్డెన్‌లో..

సిల్క్‌బోర్డ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగ్‌రోడ్డులో నీరు నిల్వ ఉండడంతో పది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎలక్ట్రానిక్‌సిటీ ఫ్లై ఓవర్‌పై నీరు నిల్వ ఉండడంతో మూసివేశారు. ఈ పరిణామం సర్వీస్‌రోడ్డుపై తీవ్రప్రభావం చూపింది. కోరమంగల, బొమ్మనహళ్ళిలలోని పలు ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరింది. హొరమావు, వాదరపాళ్యలోని సాయి లే అవుట్‌లో ఇళ్లలోకి నీరు చేరాయి. మహదేవపుర నుంచి రెస్క్యూ వ్యాన్‌లు, సివిల్ డిఫెన్స్ వార్డెన్‌లు సహాయకచర్యలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ ఎక్స్‌కవేటర్ ద్వారా వివిధ కాలనీల్లో పర్యటించారు. డ్రోన్‌లను ఉపయోగించి నీటి కష్టాలను తెలుసుకున్నారు. ట్రాక్టర్‌పై పర్యటించిన గ్రేటర్ బెంగళూరు పాలనాధికారి తుషార్ గిరినాథ్‌పై స్థానికులు విరుచుకుపడ్డారు. ఈజీపురలో రాజకాలువలోకి నీరు నుగ్గడంతో ఇళ్లల్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు నాశనమయ్యాయి. శాంతినగర్ డబుల్‌రోడ్డులో వాహనసంచారానికి సమస్య ఏర్పడింది. ఆసుపత్రి, సాఫ్ట్‌వేర్ కంపెనీలతోపాటు సీసీబీ కార్యాలయంలోకి వర్షపునీరు చేరింది. హెచ్‌బీఆర్ ఐదో స్టేజ్‌లో రోడ్లు జలమయం అయ్యాయి. కంఠీరవ స్టేడియంలోకి నీరు చేరడంతో అథ్లెటిక్స్ ప్రాక్టీస్‌ను సజావుగా చేయలేకపోయారు. ట్యానరీరోడ్డు ఎస్సీకాలనీలో పలు ఇళ్లలోకి నీరు చేరింది. చామరాజపేట ఐదో మెయిన్‌రోడ్డులో భారీవృక్షం కుప్పకూలింది. హెణ్బూరులోని వృద్ధాశ్రమంలోకి అర్ధరాత్రి తర్వాత నీరు చేరడంతో రాత్రంతా వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. వీల్‌చెయిర్ ద్వారా వారిని సోమవారం బయటకు తీసుకొచ్చారు. మహదేవపురలోని పలు ప్రాంతాల్లో రబ్బరుబోట్లను ఉపయోగించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. యలహంకలోని అట్టూరు విశ్వనాథ ఆలయంలోకి నీరు చేరడంతో జనం ఇబ్బంది పడ్డారు. సోమవారం మధ్యాహ్నం మరోసారి నగరంలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసింది. ప్యాలెస్ రోడ్డులో భారీ చెట్టు కూలడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం నెలకొంది.


సంపంగి రామనగర్ పోలీస్‌స్టేషన్‌లో వర్షపు నీటిని తొలగిస్తున్న సిబ్బంది



సాయి లే అవుట్‌లో వరద బాధితులను రబ్బర్ బోట్లతో తరలిస్తున్న పోలీసులు

మండిపడ్డ బీజేపీ

నగరవ్యాప్తంగా భారీ వర్షంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, వేలాది మంది ఇళ్లలోనుండి బయటకు వచ్చే పరిస్థితి లేకపోయిందని బీజేపీ మండిపడింది. రోమ్ నగరం తగలపడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లుగా డీసీఎం, మంత్రులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నగరమంతటా ప్రజలు ఇబ్బంది పడుతుంటే డీసీఎం డీకే శివకుమార్, రెవెన్యూ మంత్రి కృష్ణబైరెగౌడ, వసతి శాఖ మంత్రి జమీర్ అహ్మద్, విజయనగరలో రెండేళ్ల విజయోత్స ఏర్పాట్లను పర్యవేక్షించి రోడ్‌షోలు చేశారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. సాధనసభ పేరిట విజయనగరలో సభకు ఆత్రుత చూపేవారు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎందుకు సిద్ధంగా లేరని ప్రశ్నించారు.


హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో డీసీఎం డీకే శివకుమార్

ఇదేనా బ్రాండ్ బెంగళూరు?: డీసీఎంపై స్థానికుల ఫైర్

బొమ్మనహళ్ళి, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షపీడిత ప్రాంతాలను డీసీఎం డీకే శివకుమార్ సోమవారం రాత్రి పర్యటించారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్, సిల్క్‌బోర్డు తదితర ప్రాంతాల్లో పర్యటించినవేళ కొందరు ప్రజలు ఇదేనా బ్రాండ్ బెంగళూరు? అంటూ మండిపడ్డారు. ఈ అంశం సోషల్‌మీడియాలోనూ వైరల్ అయ్యింది. కాగా డీసీఎం స్పందిస్తూ వర్షపునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని బదులిచ్చారు. డీసీఎం వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉమాపతిగౌడ, రాఘవేంద్ర ఉన్నారు.


విధానసౌధ వద్ద మేఘావృతమైన ఆకాశం


కోరమంగలలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మునిగిన వాహనాలు


బీటీఎం లే అవుట్ న్యూ డాలర్స్ కాలనీలో..


గుడదహళ్లి శ్యామణ్ణ గార్డెన్‌లో..


తూము వద్ద చెత్తను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీస్

నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

● ముగ్గురు తుమకూరు జిల్లా వాసుల మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న ఇన్నోవా వాహనం

పావగడ, మే 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా డోన్ పరిధిలోని ప్యాపిలి మండలం పోతుదొడ్డి హైవే రోడ్డులో ఆరు మంది ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు సోమవారం తెల్లవారుజామున అదుపు తప్పి బోల్తాపడటంతో ముగ్గురు మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకా హుళియూర్, హోబళి, కెంకెర గ్రామాలకు చెందిన సంతోష్, నవీన్, లోకేష్, స్వామి, దర్శన్, శశిధర్ అనే స్నేహితులు రెండు రోజుల క్రితం మంత్రాలయానికి వెళ్లి ఆదివారం రాత్రి శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకుని సోమవారం ఉదయం 5గంటలకు తిరుగు ప్రయాణం అయ్యారు. నంద్యాల జిల్లా డోన్ దగ్గర కారు బోల్తాపడి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో నవీన్(43), లోకేష్(36), సంతోష్ (35) అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి సోమవారం సాయంత్రం బంధువులకు పోలీసులు అప్పగించారు. ముగ్గురు మృతిచెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

మృతుల వివరాలు..

నవీన్ చిక్క నాయనహళ్లి తాళ్లూరు పంచాయతీ మాజీ అధ్యక్షుడిగా ఉండి భార్య కావ్య, మూడు సంవత్సరాల కుమారుడిని విడిచి వెళ్లారు. సంతోష్ బీజేపీ యువ నాయకుడిగా ఉంటూ కాంట్రాక్టర్ పనులు చేస్తూ ఉండేవాడు. ఇతనికి ఐదేళ్ల కుమారుడు, భార్య లక్ష్మీ ఉన్నారు. లోకేష్ చిన్నప్పటి వ్యాపారం చేస్తుండేవాడు. ఇతనికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.


నవీన్ లోకేష్ సంతోష్ (ఫైల్)



నేడే

కాంగ్రెస్ రెండేళ్ల సంబరం..!

● హోస్పేటలో భారీ ఏర్పాట్లు ● హాజరుకానున్న రాహుల్ గాంధీ, ఖర్గే ● 3 లక్షల మంది పాల్గొంటారని అంచనా




బళ్లారి, హోస్పేట్, మే 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ సంబరాలకు సర్వం సిద్ధమయ్యింది. విజయనగర జిల్లా హోస్పేట్‌లో మంగళవారం "సమర్పణే సంకల్ప సమావేశం" పేరుతో వేడుకలు జరపనున్నారు. ఇందులో మూడు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేశారు. ఈ వేదిక ఏర్పాట్లను స్వయానా ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యవేక్షించడం విశేషం. వేదిక పై దాదాపు 150 మంది ప్రముఖ నాయకులు కూర్చొనే విదంగా వేదికలు ఏర్పాటు చేశారు. వేదిక ముందు బాగంలో 2లక్షల మంది కూర్చొనేందుకు కుర్చీలు వేయగా ఇక మిగిలిన వారు నిల్చొని చూసేవారికి కూడా ఏర్పాటు చేశారు.

2600 బస్సుల్లో జనం తరలింపు

విజయనగర, బళ్లారి, కొప్పళ, రాయచూరు, చిత్రదుర్గం, తదితర ప్రాంతాల నుంచి ప్రజలను ఈ సమావేశానికి తరలించేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేపట్టారు. రప్పిస్తున్నారు. ఈ ఐదు డిపోల నుంచి 2600బస్సులు ఏర్పాటు చేశారు. ఇక ఇతర వాహనాలు ఇక సరేసరి, దాదాపు 3 లక్షల మందికి బోజన ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపారు.

అతిరథుల రాక..

సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్షనాయకుడు, రాహుల్ గాంధీ, ఏఐసీసీ నాయకులు రణదీప్ సింగ్ సుర్జేవాలా తదితర కీలక నేతలు హాజరు కానున్నారు.

విజయాలను వివరించేందుకే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారరంలోకి వచ్చిన రెండేళ్లలో సాధించిన విజయాలు, ఏఏ పథకాలు ఎవరు పొందారు, లబ్ధిదారుల వివరాలు సభలో వివరించనున్నారు.

నేతల్లో వర్షం భయం..

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలకు వర్షం భయం పట్టుకుంది. ఆదివారం రాత్రి బలమైన గాలులు, వాన కురిసింది. చాలా వరకూ టెంట్లు నేల కూలాయి. ఒక వేళ మంగళవారం వాన కురిస్తే తిప్పలు తప్పవని నాయకులు ఆందోళన చెందుతున్నారు.

తొలిరోజు ఇబ్బందులు

కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పై చేస్తున్న సాధన సమావేశం లో బందోబస్తుకు వచ్చిన పోలీసులకు సోమవారం తీవ్ర ఇబ్బందులే కలిగాయి. ఇది ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు. సోమవారం బందోబస్తు వచ్చిన పోలీసులకు బోజన వసతులు కరువయ్యాయి. దాదాపు 3 గంటలు దాటినా భోజనం అందక పోవడంతో కొందరు పోలీసులు అక్కడే ఉండే హోటళ్లకు వెళ్లి దొరికింది తినేశారు. ఇక డయాబెటీస్, ఇతర వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సిబ్బందికి, శ్రామికులకు భోజనం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.


సిద్ధమైన వేడుక

బమూల్ డైరెక్టర్‌గా డీకే సురేశ్ ఏకగ్రీవం

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు పాల సమాఖ్య (బమూల్) కనకపుర విభాగం నుంచి డైరెక్టర్‌గా మాజీ ఎంపీ డీకే సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఆయన నామినేషన్ దాఖలు చేయగా మరెవరూ పోటీకి రాకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం ఎన్నికైన విషయం బహిరంగమైన వెంటనే బెంగళూరులోనే ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలసి ఆశీస్సులు పొందారు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) ఛైర్మన్ హోదా కోసం డీకే సురేశ్ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. కేఎంఎఫ్ ఛైర్మన్ హోదాకోసం సీఎం సిద్దరామయ్యకు ఆప్తుడిగా పేరొందిన ఎమ్మెల్యే భీమానాయక్ పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కాంగ్రెస్‌లో కేఎంఎఫ్ హోదా కోసం ఇద్దరు బలమైన నాయకులు ప్రయత్నాలు చేస్తుండంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది.

సీటీ రవికి సుప్రీంకోర్టులో బిగ్ రిలీఫ్

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను బెళగావి శాసనసభ సమావేశాలలో విధానపరిషత్‌లో అనుచితంగా దూషించారనే వివాదంలో బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవికి సుప్రీంకోర్టు బిగ్ రిలీఫ్ కల్పించింది. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ చేసిన ఫిర్యాదును రద్దు చేయాలని కోరుతూ సీటీ రవి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ధర్మాసనం సీటీ రవి పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో సీటీ రవి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే సీటీ రవి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ జరిపి తాత్కాలికంగా విచారణకు స్టే మంజూరు చేసింది. దీంతో సీటీ రవికి కేసునుంచి ఉపశమనం లభించినట్లయ్యింది.

వైజీ గుడ్డ జలాశయంలో మునిగి

ముగ్గురు యువతుల దుర్మరణం

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లా మాగడి తాలూకాలోని వైజీగుడ్డ జలాశయాన్ని చూసేందుకు వచ్చి నీట మునిగి ముగ్గురు యువతులు దుర్మరణం చెందారు. బెంగళూరుకు చెందిన ఏడుగురు జలాశయం చూసేందుకు సోమవారం వెళ్లారు. ఓ యువతి నీటిలో కొట్టుకుపోతుండడంతో రక్షించే ప్రయత్నంలో మిగిలినవారంతా ముందుకెళ్లారు. అయినా రక్షించలేకపోయారు. ఓ యువకుడు గమనించి వెంటనే నీట దూకి నలుగురిని ఒడ్డుకు తీసుకొచ్చారు. రాఘవి (18), మధుమిత (20), రమ్య (22) మృతి చెందారు. సమాచారం అందుకున్న విపత్తు నిర్వహణ సిబ్బంది మృతదేహాలను వెలికితీసి మాగడి ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. మాగడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


ఘటనా స్థలం వద్ద విచారిస్తున్న పోలీసులు

కదిరి టీడీపీ కైవసం

● మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా దిల్‌షాదున్నీషా ● వైస్ చైర్మన్లుగా మద్దేపల్లి రాజశేఖరాచారి, సేగు సుధారాణి ● ఎన్నికకు గైర్హాజరైన వైసీపీ కౌన్సిలర్లు

కదిరి, మే19(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా దిల్ షాద్ దున్నీషా, వైస్ చైర్మన్లుగా మద్దేపల్లి రాజశేఖర ఆచారి, సేగు సుధా రాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం ఉదయం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆర్డీవో వీవీ ఎస్ శర్మ, ఉప అధికారిగా కమిషనర్ కిరణ్‌కుమార్ వ్యవహరించారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్‌అఫిషియో మెంబర్‌తో కలిపి మొత్తం 37మంది ఉన్నారు. వీరిలో టీడీపీకి చెందిన 25మంది సభ్యులు హాజరుకాగా, 11మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరుకాలేదు. సమావేశం నిర్వహించడానికి అవసరమైన కోరం ఉండటంతో ఎన్నికలను నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా 10వార్డు కౌన్సిలర్ దిల్‌షాద్‌దున్నీషా, వైస్ చైర్మన్లుగా 19 వార్డు కౌన్సిలర్ మద్దెపల్లి రాజశేఖర ఆచారి, 21 వార్డు కౌన్సిలర్ సేగు సుధారాణిలను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లకు డిక్లరేషన్ అందజేసి, వారిచేత ఎన్నికల అధికారి ప్రమాణం చేయించారు. ఎన్నిక అనంతరం టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నాయి. ఎన్నికైన వారు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కందికుంట వ్యూహంతో...

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వ్యూహంతో కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం టీడీపీకి దక్కింది. గతంలో ఐదుగురు మాత్రమే టీడీపీ తరపున కౌన్సిలర్లుగా గెలిచారు. అయితే ఎన్నికల ముందు ఇండిపెండెంట్ సభ్యుడు, ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 12కు పెరిగింది. ఎన్నికల తరువాత వైసీపీ కౌన్సిలర్లు 14మంది, అప్పటి చైర్‌పర్సన్ నజీమున్నీషాపై తిరుగుబాటు చేశారు. అనంతరం టీడీపీతో కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధమయ్యారు. దానిని అవకాశంగా మలుచుకున్న ఎమ్మెల్యే అవిశ్వాసన తీర్మానానికి రంగం సిద్ధం చేశారు. టీడీపీలో ఉన్న 12మంది, వైసీపీలో ఉన్న 13మందిని కలుపుకుని అవిశ్వాస తీర్మానం నెగ్గించారు. అనంతరం చైర్మన్ ఎన్నిక సందర్భంగా తిరుగుబాటు వైసీపీ కౌన్సిలర్లు 13మంది టీడీపీలోకి చేరారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు



చైర్‌పర్సన్‌గా ఎన్నికైన దిల్‌షాదున్నీషా



వైస్ చైర్‌పర్సన్ సేగు సుధారాణి



వైస్ చైర్మన్ మద్దేపల్లి రాజశేఖరాచారి

సమావేశాలకు వైసీపీ వచ్చేనా..?

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన 11మంది వైసీపీ కౌన్సిలర్లు ఎవరు హాజరు కాలేదు. గతంలో వైసీపీకి 30మంది కౌన్సిలర్ల ఉండే వారు. ఆ ఆపార్టీ నుంచి ఏకంగా 19మంది కౌన్సిలర్లు, వైసీపీకి మద్దతిచ్చిన ఇండిపెండెంట్ కూడా టీడీపీలో చేరారు. ఉన్న వారు సమావేశాలకు హాజరు కాకపోవడంతో మున్సిపల్‌కౌన్సిల్‌లో వైసీపీ ఖాళీ అయిందని పలువురు చర్చించుకుంటున్నారు. భవిష్యత్‌లో సాధారణ సమావేశాలకు హాజరవుతారా లేదా అనే సందేహాన్ని కూడా వ్యక్తం చేస్తున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అర్జీల పరిష్కారంపై అలసత్వం వద్దు

కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 460 అర్జీలు



ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

అనంతపురం టౌన్, మే19 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కొనసాగింది. జిల్లా నలు మూలల నుంచి బాధితులు తరలిరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. మొత్తంమీద 460మంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు ఇచ్చారు. కలెక్టరుతో పాటు జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, తిప్పేనాయక్, ఆనంద్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సూచించారు ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలపట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

● ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతించిందని, నిబంధనల మేరకే ప్రతిశాఖలో నిర్వహిస్తామని కలెక్టరు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆయాశాఖల ఉన్నతాధికారులు తమ పరిధిలోని ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా బదిలీలు చేపట్టాలన్నారు.

● ప్రభుత్వ శాఖల పరిధిలో కాలం చెల్లిన వాహనాలు ఉంటే వాటిని వేలం వేయాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. జిల్లా రవాణాశాఖకు లేఖ రాస్తే మోటారు వాహన ఇన్‌స్పెక్టరు వచ్చి ఆ వాహనం విలువ తదితర అంశాలు తెలియజేస్తారన్నారు. ఆ తర్వాత వేలానికి ఆహ్వానించి వాహనాలు అమ్మి, వాటి వివరాలు రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈవేలం ప్రక్రియ జూన్ 20నాటికి పూర్తిచేయాలని కలెక్టరు ఆదేశించారు.



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా చక్రస్నానం

ఉరవకొండ, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, అర్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉద్భవలక్ష్మీ అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న మండపంలో శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేశారు. అనంతరం అర్చకులు వసంతాలు చల్లుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, అర్చకులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అమిలినేని

పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, అర్చకులు.. ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆయన పేరిట అర్చన, పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టెన్త్ సప్లిమెంటరీకి 975 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు తొలిరోజు సోమవారం 975 మంది గైర్హాజరైన ట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 42 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. రెగ్యులర్ విద్యార్థులు 2,975 మందికిగాను 2,039 మంది హాజరు కాగా.. 936 మంది గైర్హాజరయ్యారన్నారు. ప్రైవేటు విద్యార్థులు 68 మందికిగాను 29 మంది హా జరుకాగా.. 39 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అధికారులు, ఫ్ల యింగ్ స్క్వాడ్ బృందాలు 21 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ముచ్చటగా మూడోసారి..!

● రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా

● హాజరుకాని వైసీపీ ఎంపీటీసీలు

రామగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక ముచ్చటగా మూడోసారి వాయిదాపడింది. సోమవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని అధికారులు అన్ని ఏర్పా ట్లు చేశారు. ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ ఉప ఎన్నికను నిరవధింగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవ య్య ప్రకటించారు. మార్చి 27వ తేదీ ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించగా వైసీపీ సభ్యులు గైర్హాజరయ్యారు. మరుసటి రోజు 28వతేదీ ఎన్నికను నిర్వహించగా నాటకీయ పరిణామాలతో వైసీపీ ముఖ్యనాయకుల సూచనలతో సభ్యులు హాజరు కాలేదు. ఓటమి భయంతో వైసీపీ నాయకులు క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. టీడీపీలో చేరిన మహిళా సభ్యురాలిని కూడా తిరిగి వారే తీసుకెళ్లారు. సోమవారం ఉదయం 10గంటలకు ఎన్నికల నిర్వహణకు అధికారులు రాగా.. మొదట టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఇద్దరు సభ్యులు వచ్చారు. 15 నిమిషాల తరువాత వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మరో సభ్యుడు వచ్చాడు. ఎన్నికల అధికారులు 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు పెట్టారు. మహిళలకు రిజర్వు చేసిన ఎంపీపీ స్థానానికి.. మహిళా అభ్యర్థులు హాజరు కాలేదు. సమయం ముగిసేవరకు చూసిన అధికారులు.. మహిళా అభ్యర్థులు ఎవరూ రాకపోవడంతో ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. ఎన్నిక సందర్భంగా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐల తోపాటు మొత్తం 238 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ బందోబస్తును పర్యవేక్షించారు.



హాజరైన ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు

ఎన్ఎస్ గేటులో భారీ బందోబస్తు

చెన్నేకొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక నేపథ్యంలో చెన్నేకొత్తపల్లి మండలంలోని ఎన్ఎస్ గేటు వద్ద సోమవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగిరి వైపు వెళ్లే రహదారిలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. చెన్నేకొత్తపల్లిలో న్యామద్దల రోడ్డు, జాతీయ రహదారి కూడలిలో ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఎన్ఎస్ గేటులో బందోబస్తులో పోలీసులు

ఎంపీపీగా సోముశేఖర్ రెడ్డి

గాండ్లపెంట, మే 19(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా ఉత్కంఠ రేపిన ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎంపీపీగా గజ్జల సోముశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాల్సి ఉండగా, సోముశేఖర్ రెడ్డి, జయరామకృష్ణారెడ్డి, భారతి, గంగోజమ్మ మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీగా సోముశేఖర్‌రెడ్డిని జయరామిరెడ్డి ప్రతిపాదించగా, భారతి బలపరిచారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం ఎంపీపీగా గజ్జల సోముశేఖర్‌రెడ్డికి డిక్లరేషన్ పత్రాన్ని అందచేసి, ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బాబురావు, ఆర్ఐ అశోక్ తదితరులున్నారు.

ఎంపీపీకి ఘన సన్మానం

ఎంపీపీ బాధ్యతలు స్వీకరించిన సోముశేఖర్‌రెడ్డికి ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ఎంపీపీని పలువురు పూలమాలలు, శాలువతో సన్మానించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌వరకు ఎంపీపీ ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ కొండయ్య, మాజీ సింగ్‌విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ రహంతుల్లా, శివప్పనాయుడు, సిద్దారెడ్డి, చంద్ర, నరసింహులు, రామాంజులరెడ్డి, అక్రమ్ బాషా, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, కాకార్ల రవీంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గజ్జల సోముశేఖర్‌రెడ్డి, అనంతరం సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం

విద్యతోనే ఉన్నత స్థానాలకు..

విప్ కాలవ, ఎంపీ అంబికా

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న విప్ కాలవ, ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్/సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): విద్యతో ఉన్నత స్థానాలకు చేరవచ్చని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. వాల్మీకి ఉ ద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో ప దో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి వి ద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం స్థానిక వా ల్మీకి భవన్‌లో నిర్వహించారు. విప్, ఎంపీ మాట్లాడుతూ.. పవిత్ర రామాయణ ఇతిహాసాన్ని భారతజాతికి అందించిన వాల్మీకి వారసులుగా చెప్పుకునేలా చదువుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని సూచించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ట్యాబ్‌లను విప్ కాలవ శ్రీనివాసులు వ్యక్తిగతంగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఆర్‌సీ అక్కులప్ప, చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, రిటైర్డ్ డీఎఫ్ఓ ఆదినారాయణ, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ కార్పొరేటర్ తలారి ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ప్రారంభం

తొలిరోజు 90శాతం హాజరు

అనంతపురం సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీసెట్-20 25 సోమవారం ప్రారంభమయ్యాయి. 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమింగ్. 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. రోజు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలుంటాయి. అనంతపురంలో ఐదు, తాడిపత్రిలో రెండు, గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున మొత్తం 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,021 మంది విద్యార్థులకుగాను 2,730 మంది పరీక్షలు రాసినట్లు ని ర్వాహక అధికారులు తెలిపారు. హాజరు శాతం 90.37 నమోదైనట్లు పేర్కొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గంలో అనంతకు చోటు

కార్యవర్గ సభ్యుడిగా సంతోష్‌కుమార్



అనంతపురం విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గంలో జిల్లాకు చోటు దక్కింది. జాతీయ కార్యవర్గ సభ్యుడిగా జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం వెల్లడించారు. తిరుపతిలో నిర్వహించిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో కొత్తగా జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేస్తున్న తనకు జాతీయ కార్యవర్గసభ్యుడిగా అవకాశం కల్పించారన్నారు. రాష్ట్రం నుంచి ఆరుగురికి అవకాశం దక్కిందని ఆయన వెల్లడించారు.

మామిడి మాటున విషం..!

● కార్బైడ్‌తో మాగబెడుతున్న వ్యాపారులు

● పట్టించుకోని ఆహార భద్రతాధికారులు

పుట్టపర్తిరూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఫలరాజుగా ప్రసిద్ధిగాంచిన మామిడిపండ్లను ఇష్టపడని వారుండరు. ప్రస్తుతం మామిడిపండ్ల సీజన్ కావడంతో ఎక్కడ చూసినా విక్రయిస్తున్నారు. మంచి రంగును చూసి మైమరిచి ఎంతధరైనా కొనితీసుకెళ్తున్నారు. ఇంటికెళ్లి కోసి తినేటప్పుడు కాని దాని అసలు రంగు బయటపడటంలేదు. మంచి రంగుతో ఉన్న మామిడిపండ్లు రుచిపచీ లేకుండా చప్పగా ఉంటున్నాయి. సహజసిద్ధమైన రుచి, వాసన లేక మామిడి మధురాన్ని వినియోగదారులు అనుభవించలేకపోతున్నారు. దీనికి ప్రధాన కారణం రసాయనాలతో మాగబెట్టడమే. జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు కార్బైడ్‌తో మాగపెట్టిన మామిడిపండ్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు మామూళ్లకు మరిగి మండీల వైపు చూడటంలేదనే విమర్శలు ఉన్నాయి.

సహజంగా ఎలా మాగబెడతారంటే..

చెట్ల నుంచి మామిడికాయలు కోశాక ఎండుగడ్డి మధ్యలో ఉంచి గదిలోని గాలి బయటకు పోకుండా వేడిపెంచడం ద్వారా మాగబెడతారు. వారం పదిరోజుల్లో పూర్తిగా మాగి మంచి వాసన, రంగుతో నిగనిగలాడుతాయి. ఈ పద్ధతిలో ఎక్కువ సమయం పడుతుండటంతో ఏదోరకంగా మాగబెట్టి త్వరగా అమ్మిసొమ్ము చేసుకోవాలనే దోరణిలో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు.



కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడిపండ్లు

వ్యాపారులు ఎలా చేస్తున్నారంటే..

పక్వానికి రాకుండానే మామిడికాయలను కోసేసి వ్యాపారులు కార్బైడ్ పెట్టి మాగబెడుతున్నారు. దీంతో రెండు మూడురోజుల్లోనే కాయలకు నిగనిగలాడే రంగు వస్తోంది. పైకి బాగా కనపడుతున్నా లోపల ఉన్న కండంతా దెబ్బతింటోంది. కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడిపండ్లను తింటే కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు, ఊపిరితిత్తుల సమస్యలే కాక క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఎర్ర రక్తకణాలు దెబ్బతిని రక్తంలో ఆక్సిజన్ తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

నిబంధనలు గాలికి..

ఆహారభద్రతా నిబంధనల మేరకు ఇథలీన్ పౌడర్‌తో మామిడికాయలను మాగబెట్టవచ్చు. పౌడర్ ఉండే కవర్‌కు రంధ్రం చేసి మామిడి పండ్ల మధ్యలో ఉంచడం ద్వారా గాలి బయటకు పోకుండా చూస్తే రెండుమూడురోజుల్లో కాయలు మాగే అవకాశం ఉంది. కార్బైడ్ వాడకంపై నిషేధం ఉంది. కార్బైడ్‌తో మామిడిపండ్లను మాగబెట్టి అమ్మడం నేరం. ఇలాంటి దుశ్చర్యలను అరికట్టాల్సిన ఆహారభద్రతా అధికారులు అటువైపు కూడా కన్నెత్తి చూడడం లేదు.

చర్యలు తీసుకుంటాం



కార్బైడ్‌తో మామిడికాయలను మాగబెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మండీలను తనిఖీచేసి చర్యలు తీసుకుంటాం. బాధ్యులపై కేసులు నమోదుచేస్తాం. ఎవరైనా ఇలాంటి పద్ధతిలో మామిడికాయలను మాగబెట్టి విక్రయిస్తుంటే మాకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. మా ఫోన్ నంబరు 9703383684కు ఫోన్‌చేసి వివరాలు తెలపవచ్చు. సదరు మామిడిపండ్లను శాంపిల్ తీసి నిబంధనలకు విరుద్ధంగా మాగబెడుతుంటే కేసులు నమోదు చేస్తాం.

-రామచంద్ర, జిల్లా ఆహార భద్రతాధికారి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

పరమాచార్య చంద్రశేఖర స్వామి (జయంతి)



కంచికామకోటి పీఠానికి 68వ పీఠాధిపతిగా వ్యవహరించి జగద్గురుగా పేరొందిన చంద్రశేఖరానంద సరస్వతి స్వామి 1894 మే 20న తమిళనాడు రాష్ట్రం విల్లుపురంలో జన్మించారు. అసలు పేరు స్వామినాథన్. 18వ యేట సన్యాసం స్వీకరించిన అనంతరం చంద్రశేఖర సరస్వతిగా మారారు. వేదాలు, పురాణాలు, సాహిత్యంలో రాణించారు. ఆదిశంకరాచార్య మార్గంలో సాగారు. ధర్మం, సంప్రదాయాలను దేశవ్యాప్తంగా విస్తృతం చేశారు. కామాక్షి దేవి ఆలయంతోపాటు ఇతర ఆలయాల జీర్ణోద్ధరణకు సహకరించారు. 1994 జనవరి 8న పరమపదించారు.

ఎండీ రామనాథన్ (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు, గాయకులు, 'పద్మశ్రీ' గ్రహీత మంజపర దేవేశ భాగవతార్ రామనాథన్ 1923 మే 20న కేరళ రాష్ట్రం పాలక్కాడ్ (పాల్ఘాట్) జిల్లా మంజపర గ్రామంలో జన్మించారు. భావ, లయలలో తనదైన ప్రతిభను చాటుకున్నారు. కళాక్షేత్రలో ప్రారంభమైన 'సంగీత శిరోమణి' తొలి బ్యాచ్‌లో ఉత్తీర్ణుడైన ఏకైక విద్యార్థి. సంగీత కళాశాల ప్రొఫెసర్‌గా రాణించారు. తమిళ, తెలుగు, సంస్కృతంలలో 300కుపైగా పాటలకు కర్ణాటక సంగీతాన్ని స్వరపరిచారు. గురువు టైగర్ వరదాచారిపై గౌరవంతో తన కృతులలో 'వరదదాస' అనే పదాన్ని ముద్రగా వాడుకున్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళాసింగమణి తదితర అవార్డులు పొందారు. 1984 ఏప్రిల్ 27న కన్నుమూశారు.

సిరివెన్నెల సీతారామ శాస్త్రి (జయంతి)



'సిరివెన్నెల' సినిమా పేరుతోనే గుర్తింపు పొందిన చేంబోలు సీతారామ శాస్త్రి 1955 మే 20న విశాఖపట్నం జిల్లా అనకాపల్లెలో జన్మించారు. సినీ గేయ రచయిత. 'విధాత తలపున ప్రభవించినది...' ఆయన రాసిన తొలిపాట సినీ అభిమానుల గుండెల్లో పదిలంగా నిలిచింది. 11 నంది అవార్డులు, 4 సినిమా అవార్డులు అందుకున్నారు. 3వేలకుపైగా పాటలు రాశారు. ఆయన అందించిన సేవలకు 2019లో పద్మశ్రీ పురస్కారం పొందారు. 2021 నవంబరు 30న కన్నుమూశారు.

టంగుటూరి ప్రకాశం పంతులు (వర్ధంతి)



'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోదరాయునిపాలెంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మద్రాస్ ప్రెసిడెన్సీలో 1946-47, స్వాతంత్ర్యానంతరం 1953-54ల మధ్య ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. నిరుపేద కుటుంబంలో జన్మించి వారాలు చదువుకుని ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడు. క్విట్ ఇండియాలో పాల్గొని అరెస్టు అయి స్వాతంత్ర్యానంతరం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయకపాత్ర పోషించారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలు తుపాకీకి ఎదురుగా నిలిచి 'ఆంధ్ర కేసరి'గా పేరొందారు. 1957 మే 20న కన్నుమూశారు. ఆయన సేవలకు గుర్తుగా 1972లో ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారు.

జూనియర్ ఎన్టీఆర్ (పుట్టినరోజు)



నందమూరి తారకరామారావు 1983 మే 20న జన్మించారు. తెలుగు సినీ రంగంలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటులలో ఒకరు. స్వర్గీయ ఎన్టీఆర్ మనవడు, నందమూరి హరికృష్ణ కుమారుడు. తాతకు తగ్గ మనవడు అనిపించుకున్నారు. బ్రహ్మర్షి విశ్వామిత్ర సినిమాలో బాలనటుడిగా నటించారు. 20 ఏళ్ల సినీ జీవితంలో పలు హిట్ సినిమాలలో నటించారు. నటన, డైలాగ్ చెప్పడంలో, రిహార్సల్స్ లేకుండా నృత్యాలు సింగిల్ టేక్‌లో తీసుకోవడం ఆయన ప్రత్యేకత. రెండు రాష్ట్ర నంది అవార్డులు, ఫిల్మ్‌ఫేర్, నాలుగు సినిమా అవార్డులు అందుకున్నారు. బుల్లితెరపై బిగ్‌బాస్ వంటి కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరించారు. అభిమానులు ముద్దుగా 'తారక్' అని పిలుస్తారు. ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాట ఉత్తమ ఒరిజినల్ సాంగ్‌గా ఆస్కార్ అవార్డు గెలుచుకుంది.

మినీ మహానాడును విజయవంతం చేయండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

పుట్టపర్తి రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మామిళ్ళకుంట కూడలిలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 24న జరిగే మినీ మహానాడును విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయి మినీ మహానాడును కుటుంబ కార్యక్రమంగా భావించి పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జిల్లా వాల్మీకి సాధికార సమితి అధ్యక్షుడు బోయ రామాంజినేయులు, జిల్లా వడ్డెర సాధికార సమితి అధ్యక్షులు వడ్డే రవీంద్ర, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, ఉపాధ్యక్షుడు కోగర నరసింహ, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, జనరల్ సెక్రటరీ కళ్యాణ్, తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

హైకోర్టు రిటైర్డు జస్టిస్‌కు సీఎం నివాళులు



ఎస్ఆర్ నాయక్ (ఫైల్)

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగాను ఛత్తీస్‌ఘడ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన ఎస్ఆర్ నాయక్ (80)కు సీఎం సిద్దరామయ్య నివాళులు అర్పించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ ఆదివారం కన్నుమూశారు. పార్థివ దేహాన్ని ఆర్ఎంవీ రెండోస్టేజ్ డాలర్స్‌కాలనీ నివాసంలో అంతిమదర్శనం కోసం ఉంచారు. బంధువులు, పలువురు మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు, అభిమానులు నివాళులు అర్పించారు. సీఎం సోమవారం పార్థివదేహాన్ని సందర్శించిన అనంతరం కుటుంబీకులను ఓదార్చారు. ఎస్ఆర్‌నాయక్‌కు భార్య శాలిని, కుమారుడు ఎస్ఎస్ రాహుల్, కుమార్తె నిశాగావ్కర్‌లు ఉన్నారు. ఉత్తరకన్నడ జిల్లా కుమట తాలూకా నాడమ్యానకేరి గ్రామంలో 1941 జనవరి 1న ఎస్ఆర్ నాయక్ జన్మించారు. మైసూరులో బీఎస్సీ, బెంగళూరులో లా కోర్సు పూర్తి చేసి 1974లో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించారు. బెంగళూరు బిఎంఎస్, ఎస్ఎల్ఎస్ఆర్‌సి హవనూరు లా కాలేజీలలో అధ్యాపకుడిగాను సేవలందించారు. 1994 ఫిబ్రవరి 25న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయి అక్కడ న్యాయ అకాడమీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత ఛత్తీస్‌ఘడ్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. కర్ణాటక మానవహక్కుల కమిషన్, లా కమిషన్ ఛైర్మన్‌తోపాటు నాడోజ గౌరవం అందుకున్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వివేక్ సుబ్బారెడ్డి, మాజీ ఛైర్మన్ కేపీ రంగనాథ్, అడ్వకేట్ జనరల్ శశికిరణ్‌శెట్టితోపాటు పలువురు నివాళులు అర్పించారు. సాయంత్రం హెబ్బాళ స్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.



నివాళులు అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బి. శివణ్ణ, పాల్గొన్న మంత్రి దినేశ్‌గుండూరావు తదితరులు

దొమ్మసంద్ర, మే 19(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలో వంద పడకల సామర్థ్యం గల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్‌గుండూరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే శివణ్ణ డిమాండ్ మేరకు స్థానిక ప్రజలకు వీలుగా రూ.37.17 కోట్లతో వంద పడకల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ప్రైవేట్ ధీటుగా నిర్మించనున్నట్టు తెలిపారు. ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఐసీయూ, సిటీ స్కానింగ్, కాన్పు, ఓపీడీ, ఇన్‌పేషంట్‌తోపాటు 24/7 గంటలు సేవలం దించేలా ప్రభుత్వ ఆసుపత్రిని ఇక్కడ అందుబాటులోకి తేనున్నట్టు తెలిపారు. ఇందుకు అనుగుణంగా వైద్యులు, నర్సులు ఇక్కడ అందుబాటులో ఉంటారన్నారు. ఎమ్మెల్యే బీ శివణ్ణ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు నన్ను మూడుసార్లు గెలిపించారన్నారు. వారికి ఆరోగ్య ప్రాధాన్యతను కల్పించేలా అన్ని హంగులతో ప్రభుత్వ ఆసుపత్రిని అందుబాటులో సిద్ధం కానుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నృత్య కళాకారిణిని ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో దొమ్మసంద్ర గ్రామపంచాయతీ పీడీఓ మంజునాథెడ్డి, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు నరేశ్, సభ్యులు జయదేవ్, మాజీ సభ్యులు ధనలక్ష్మి, బెంగళూరు డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు డీవీ సురేశ్‌రెడ్డి, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగం స్ఫూర్తిదాయకం

బాగేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి అనంతరం జమ్ము కశ్మీర్ నియంత్రణ రేఖ వద్ద విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వీర యోధుడు మురళీనాయక్ మరణం దేశభక్తిని పెంపొందిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా ఉంటుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మురళీనాయక్ సంస్మరణ నేపథ్యంలో స్థానిక బంజారా (లంబాణి) సముదాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ హెచ్ నరసింహయ్య సర్కిల్‌లో తొలుత మురళీనాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ ఎంతో జీవితం చూడాల్సి ఉన్నప్పటికీ చిన్నవయస్సులోనే దేశం కోసం వీరమరణం పొందాడని అభిప్రాయపడ్డారు. దేశసేవ చేస్తూ వీరమరణం పొందిన మురళీనాయక్‌కు గౌరవ ప్రణామాలు తెలిపారు. ఎండా, వాన, చలి వంటివి లెక్కించక సరిహద్దులో కాపలా కాస్తున్న సైన్యం సేవలు ప్రశంస నీయమన్నారు. పలువురు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్మీలో చేరేం దుకు యువత ముందుకు రావాలన్నారు. భారత్‌మాతాకీ జై, మురళీనాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. శ్రీరామనాయక్, శంకరనాయక్, నారాయణ నాయక్, వెంకటరామప్ప, శ్రీనివాస్, నాగేనాయక్, న్యాయవాది బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మురళీనాయక్ పేరిట అన్నదానం

చింతామణి తాలూకాలో భారీ వర్షం

చింతామణి, మే 19(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం, రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వేసవి ఎండలనుంచి కొంత ఉపశమనం లభించినట్టయ్యింది. పట్టణంలోని పలు రోడ్లు జలమయం కావడంతో సంచారానికి సమస్య ఏర్పడింది. వాహనదారులు, పాదచారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంజీ రోడ్డులోని బంబూబజార్ సర్కిల్‌నుంచి నగరసభ అక్రాయ్ కార్యాలయం వరకు రోడ్డుపై నీరు చేరింది. దీంతో వ్యాపార లావాదేవీలకు అంతరాయం నెలకొంది. ప్రధానంగా కాలువలో వర్షపునీరు సజావుగా ప్రవహించకపోవడంతోనే సమస్య ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలలోకి, కిశోర విద్యాభవన్ క్రీడా మైదానంలోకి వర్షపునీరు చేరింది.



చింతామణి పట్టణం ఎంజీ రోడ్డులో వర్షపునీరు

వర్షపీడిత ప్రాంతాల్లో స్థానిక నాయకుల పర్యటన

బొమ్మనహళ్ళి, మే 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో పలు ప్రాంతాలు జలావృతమయ్యాయి. అపార్ట్‌మెంట్‌లలోని పలు సెల్లార్‌లలోకి భారీగా వర్షపునీరు చేరింది. వర్షపీడిత ప్రాంతాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉమాపతిగౌడ, రాఘవేంద్ర, పర్యటించారు. హెచ్ఎస్ ఆర్ లే అవుట్, హొంగసంద్ర, బిలేకహళ్ళి, మంగమ్మనపాళ్య, మాదేనగర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అగ్నిమాపక శాఖ, ఇతర శాఖల సహకారంతో సెల్లార్‌లలో చేరిన నీటిని పంప్‌సెట్లతో తోడే ప్రక్రియ చేపట్టారు.



స్థానికుల సమస్యలను ఆలకిస్తున్న ఉమాపతిగౌడ



పంప్‌సెట్లతో నీటిని తోడేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు అందజేత

బంగారపేట, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామకపత్రాలు అందచేశారు. ఎమ్మెల్యే నారాయణస్వామి మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగాలు కొన్ని సిఫారసులు ద్వారా సాగేవని, ప్రస్తుత ప్రభుత్వంలో విద్యావంతులకు మెరిట్ ద్వారా నియామకాలు సాధ్యమవుతున్నాయన్నారు. బీజేపీ అవధిలో నియామకాలు సాగలేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు వేతనాలు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిపారు. కాగా తాలూకాలో కార్మికుల పిల్లలకోసం 400 మంది సామర్థ్యం కల్గిన ఉత్తమ పాఠశాల, హాస్టల్ నిర్మాణానికి రూ.30కోట్లతో త్వరలో చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశప్ప, సీడీపీఓ మునిరాజు, మహిళాసంఘం అధ్యక్షురాలు గీతా, ఫోక్ సంస్థ హరీశ్ పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

భూ తగాదాలతోనే రైతు దంపతుల హత్య : డీఎస్పీ

రాప్తాడు, మే 19(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతోనే రాప్తాడు రైతు దంపతులు చిగిచెర్ల నారాయణరెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మ హత్యలు జరిగాయని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గంగలకుంట క్రాస్ వద్ద ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని, వారి నుంచి నాలుగు వేట కొడవళ్లు, కట్టెలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో నిందితులు, ఆయుధాలను చూపించారు. రాప్తాడుకు చెందిన చిగిచెర్ల నారాయణరెడ్డికి (హతుడు చిగిచెర్ల నారాయణరెడ్డి తండ్రి) చెందిన 6.20 ఎకరాల భూమిని ఎకరం రూ.15 వేల ప్రకారం రూ.93 వేలకు రాప్తాడుకు చెందిన పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మమ్మ కొనుగోలు చేసి, అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. కానీ నారాయణరెడ్డి ఆ ముగ్గురు మహిళల పేరిట అప్పట్లో రిజిస్ట్రేషన్ చేయించలేదని, దీంతో వారు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. 2012లో కోర్టు ముగ్గురు మహిళలకు ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించిందని, దీంతో చిగిచెర్ల నారాయణరెడ్డి.. ఆ భూమి తన బావ ఓబిరెడ్డి భార్య నారాయణమ్మకు చెందినదని కోర్టును ఆశ్రయించాడని తెలిపారు. అప్పటి నుంచి కోర్టులో విచారణ జరిగి, 2022లో ఆ భూమి ముగ్గురు మహిళలకే చెందిందని కోర్టు నిర్ధారించిందని తెలిపారు. హై కోర్టు కూడా ఇటీవల ఆ భూమి ముగ్గురు మహిళలకే చెందుతుందని ప్రకటించిందని తెలిపారు. హై కోర్టు ఆదేశాలు, జిల్లా రెవెన్యూ అధికారుల ఉత్తర్వుల మేరకు రాప్తాడు తహసీల్దార్ విజయకుమారి ఆ భూమిని ముగ్గురు మహిళల్లో ఒకరైన పుల్లమ్మ పేరిట ఈ నెల 14న ఆన్‌లైన్ చేశారని తెలిపారు. వివాదంలో ఉన్న ఆ భూమిని 2024 అక్టోబరులో ఎకరం రూ.56.50 లక్షలు చొప్పున 6.20 ఎకరాలను ఆ ముగ్గురు మహిళల నుంచి రాప్తాడుకు చెందిన పామళ్ల ధనుంజయ, పామళ్ల కొండప్ప, పామళ్ల ఇంద్రశేఖర్, గోనిపట్ల శీనా, పామళ్ల పండయ్య అలియాస్ కథల పండయ్య, గొల్లపల్లి జగదీష్, లక్ష్మీనారాయణ, నందకుమార్, బుల్లే నగేష్ కొని, అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. ఈ నెల 16న పామళ్ల ధనుంజయ, పామళ్ల కొండప్ప, గోనిపట్ల శీనా, కథల పండయ్య, హనుమంతరెడ్డి, బాల నరసింహారెడ్డి, నిరంజన్‌రెడ్డి, పుల్లమ్మ, కందుకూరు నాగలక్ష్మి, దండు నరేంద్ర, గొల్లపల్లి జగదీష్, గంగలకుంట లక్ష్మీనారాయణ, బుల్లె నగేష్ ఆ భూమిలోకి వెళ్లారని, ఈ భూమిలోకి వస్తే చంపేస్తామని చిగిచెర్ల నారాయణరెడ్డి భార్య ముత్యాలమ్మను బెదిరించారని తెలిపారు. ఆ మరుసటి రోజు శనివారం ఉదయం 9.30 గంటలకు ఆ పొలానికి వెళ్లి, ఎక్స్‌కవేటర్‌తో దానిమ్మ చెట్లను తొలగిస్తుండగా... చిగిచెర్ల నారాయణరెడ్డి, ఆయన భార్య ముత్యాలమ్మ, కుమారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, బావమరిది ప్రతాప్‌రెడ్డి పొలానికి వెళ్లి అడ్డుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వారు ఘర్షణ పడ్డారని, ముత్యాలమ్మ, నారాయణరెడ్డిని ప్రత్యర్థులు వేట కొడవళ్లతో నరికారని తెలిపారు. ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, నారాయణరెడ్డి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడని తెలిపారు. ఈ కేసులో రాప్తాడుకు చెందిన పామళ్ల ధనుంజయ, పామళ్ల ఇంద్రశేఖర్, దండు నరేంద్ర, నిరంజన్‌రెడ్డి, కందుకూరు దయ్యం హనుమంతరెడ్డి, గంగలకుంటకు చెందిన బుడగ లక్ష్మీనారాయణను రిమాండుకు పంపామన్నారు.

పారా ఒలింపిక్స్ క్రీడాకారులకు సహకారం



పారా ఒలింపిక్స్ అథ్లెట్లకు సన్మానం

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులకు పారా ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకోసం ప్రోత్సహిస్తున్నట్టు బోషియా ఇండియా సంస్థ ప్రకటించింది. ఈమేరకు నగరంలో బోషియా స్టేట్‌లెవెల్ అవేర్‌నెస్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను లాంఛనంగా ప్రారంభించింది. 2028లో లాస్‌ఏంజెల్స్‌లో జరిగే పారా ఒలింపిక్స్‌కు ఎంపికైన అన్నపూర్ణ కృష్ణమూర్తి, గాయత్రి హెచ్‌ఎంలను సన్మానించారు. వీరిద్దరూ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న మేరకు సత్కరించారు. కాంగ్రెస్ నాయకురాలు, సామాజిక కార్యకర్త మీనాక్షి కృష్ణబైరేగౌడ , పారాబోసియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శిఖధాడ, బోసియా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అశోక్ బేడి, ఐఆర్ఎఎస్ సభ్యురాలు కమలప్రియ, మణిపాల్ ఆసుపత్రి వైస్‌ప్రెసిడెంట్ సత్యనారాయణ, జైన్ ఆసుపత్రి ట్రస్టీ అశోక్‌రాంకాతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన ఎలక్ట్రానిక్స్ మ్యూజిక్

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ మ్యూజిక్ యువతను ఉర్రూతలూగించింది. అర్జున్ వాఘాలే మ్యూజిక్ షో జరిపారు. వారాంతంలో యువత ఉత్సాహంగా గడిపేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకుడు అశిన్ మైత్ర ప్రకటించారు. వందలాదిమంది ప్రదర్శనలో పాల్గొని సంబరపడ్డారు.

ఢిల్లీలో కుమారస్వామి గృహప్రవేశం

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి ఢిల్లీలో గృహప్రవేశం చేశారు. సోమవారం కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో గృహప్రవేశం చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి సోమణ్ణ పాల్గొన్నారు. మాజీ ప్రధాని, తండ్రి దేవేగౌడ గృహప్రవేశంలో భాగస్వామ్యులయ్యారు. కుమారస్వామి భార్య అనితా, తనయుడు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను దూషించిన జైలు వార్డర్ అరెస్టు

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్యను ఏకవచనంతో దూషించిన మైసూరు సెంట్రల్‌జైల్ వార్డర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సీఎం సిద్దరామయ్యను ఉద్దేశించి జైలువార్డర్ పునీత్ ఇటీవల తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఏకవచనంతో దూషించారు. టీకే లే అవుట్ నివాసి పవన్ ఫిర్యాదు మేరకు సరస్వతిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు వార్డర్ పునీత్‌ను సోమవారం అరెస్టు చేశారు.

ఆకాంక్ష నాయర్ ఆత్మహత్యకు ప్రేమ విఫలమే కారణం

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా ధర్మస్థళకు చెందిన ఏరోనాటిక్స్ ఇంజనీర్ ఆకాంక్ష ఎస్ నాయర్ ఆత్మహత్యకు ప్రేమ విఫలమే కారణమని పంజాబ్ పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈనెల 17న పంజాబ్ పగ్వారాలోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలోని నాల్గో అంతస్థు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఆకాంక్ష ఆరు నెలలుగా ఢిల్లీలో ఏరోనాటిక్స్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. సర్టిఫికెట్‌లకోసం వచ్చిన వేళ దారుణం జరిగింది. ఇదే యూనివర్సిటీ ప్రొఫెసర్ బిజిల్ మాథ్యూతో ఆకాంక్ష ప్రేమలో ఉన్నారు. మాథ్యూ కేరళ రాష్ట్రం కొట్టాయం నివాసి కాగా అతడికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆకాంక్ష నేరుగా మాథ్యూ ఇంటికి వెళ్లి పెళ్లి చేసుకుందామని గొడవ చేసినట్టు తెలుస్తోంది. ఇద్దరిమధ్యా జరిగిన గొడవ కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది.

వీధికుక్కలదాడిలో ఐదు గొర్రెల మృతి




ఘటనా స్థలంలో గ్రామస్థులు

శిడ్లఘట్ట, మే 19(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కుత్తాండహళ్ళి గ్రామంలో వీధికుక్కలు దాడి చేసిన ఘటనలో ఐదు గొర్రెలు మృత్యువాత చెందాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత పెద్దసంఖ్యలో వీధికుక్కలు గుంపుగా చేరి గొర్రెలమందపై దాడి చేశాయి. దీంతో ఐదు గొర్రెలు మృతి చెందగా 4 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. మునివెంకటరాయప్పకు చెందిన గొర్రెలదొడ్డిలోకి వీధికుక్కలు చొరబడి దాడి చేశాయి. సోమవారం ఉదయం పశుసంవర్ధకశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వానొస్తుంది.. జాగ్రత్త: ఆర్డీఓ

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దారు కార్యాలయాలలో కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఫోన్ నంబరు 9866057959 అందుబాటులో ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో సంప్రదించాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.27	1,577.60
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,384	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	381	13
నీటి నిల్వ (టీఎంసీలు)	8.19	3.42

4.52 కోట్ల మందికి ఉచిత ప్రయాణం

● ఉభయ జిల్లాల్లో శక్తి పథకం వినియోగించుకున్న మహిళలు ● పేదలకు ఎంతో ఉపయోగకరం..

బళ్లారి గాంధీనగర్, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు ఉచిత రవాణా కల్పించాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'శక్తి' పథకం విజయవంతంగా నడుస్తోంది. ఉభయ జిల్లాలో మహిళలు, ఆడ పిల్లలతో కళ్యాణ కర్నాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి విభాగం సామాన్య బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించినట్లు కళ్యాణ కర్ణాటక విభాగం అధికారులు తెలిపారు. ఈ పథకంలో బళ్లారి జిల్లాలో ఇప్పటి వరకు(మార్చి వరకు) 4,52,37,755 మంది మహిళలు ఉచితం ప్రయాణ లబ్ధిపొందారు. శక్తియోజన అమలైన తర్వాత జిల్లాలో మహిళలు, యువతులు, ఆడపిల్లలు ఉచితంగా ప్రయాణం క్రింద రూ 167,99,61,992 విలువ చేసే టికెట్లు పంపిణీ చేయగా, ఈ మొత్తం విభాగానికి ఆదాయ రూపంలో సమకూరినట్లు తెలిపారు. ఇందులో బళ్ళారి జిల్లా-1, బళ్ళారి-2, బళ్ళారి-3, సిరుగుప్ప, కురుగోడు, సండూరు విభాగాలున్నాయి. శక్తి యోజన క్రింద ఇప్పటి వరకు బళ్ళారి-1 విభాగంలో 73,55,413 మంది ప్రయాణించగా మొత్తం 30,92,36,224 మొత్తం టికెట్లు పంపిణీ చేసినట్లు, బళ్ళారి-2 విభాగంలో 71,14,913 మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించగా, 37,89,38,056 విలువ చేసే టికెట్లు పంపిణీ చేశారు. అదే రీతిలో బళ్ళారి-2 విభాగంలో 1,05,56,205 మంది ప్రయాణించగా, మొత్తం 18,39,41,365 మొత్తం టికెట్లు పంపిణీ చేశారు. సిరుగుప్ప విభాగం పరిధిలో 74,18,672 మంది మహిళలు ప్రయాణించగా, 31,05,36,366 రూపాయలు విలువ చేసే టికెట్లు ఇచ్చారు. మిగిలిన కురుగోడు విభాగంలో 43,73,244 మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించగా, 18,56,36,676 రూపాయలు విలువ చేసే టికెట్లు పంపిణీ జరిగింది. సండూరు విభాగంలో 84,19,308 మంది మహిళలు ప్రయాణించగా, రూ 31,16,73,305 విలువ చేసే టికెట్లు పంపిణీ చేసినట్లు కల్యాణ కర్నాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి విభాగం అధికారులు పేర్కొంటున్నారు. శక్తి యోజన ద్వారా మహిళలు సుదూర ప్రాంతాలకు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సహకరించడంతో పాటు విద్యార్థులకు ఈ పథకం చాల ఉపయోగపడిందని చెప్పవచ్చు.



బస్సు ప్రయాణానికి వేచివున్న మహిళలు

మహిళా కార్మికులకు ఉపయోగకరం: కావేరి, కర్చేడు



పనుల కోసం నిత్యం బస్సుల్లో సంచరించే మహిళా కార్మికులకు ఉచిత ప్రయాణం ఎంతో ఉపయోగకరం. మహిళల సబలీకరణకు ఈ పథకం శక్తి నిచ్చినట్లు అయింది. అరకొర జీతాలొచ్చే మాలాంటి వారికి ఆర్థికంగా శక్తి నిచ్చినట్లయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల్లో ఇది ఎంతో విజయవతమైంది.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

● 26 బైక్‌ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

బళ్లారిరూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో బ్రూస్‌పేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు బళ్లారిలోని ప్రభుత్వ సంయుక్త బాలియర కళాశాల బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనం చోరీకి గురయ్యింది. నిందితుల గుర్తింపు కోసం ఎస్పీ శోభారాణి ఆదేశాల మేరకు అదరపు బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితుడిని అరెస్ట్ చేయగా 26 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్లు బయట పడింది. రూ.10.60 లక్షల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కాశీప్రసాద్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

జవానుపై హత్యాయత్నం

● పొలం తగాదాలే కారణం



గాయపడిన చన్నబసవ

రాయచూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు పట్టణంలో సోమవారం ఉదయం ఆర్మీ జవాను పై హత్యాయత్నం జరగడం కలకలం రేపింది. లింగసుగూరు పట్టణ పరిధిలోని కసబా లింగసుగూరు గ్రామానికి చెందిన చన్నబసవ సైన్యంలో పని చేస్తుండగా నెల రోజుల క్రితం సెలువు పై స్వగ్రామానికొచ్చారు. పట్టణంలోని లేఔట్‌లో మార్నింగ్ వాక్‌ను ముగించుకున్న ఆయన ఒక సిమెంట్ బెంచీ పై సేద తీరుతున్న సమయంలో టీవీఎస్ బైక్ పై వచ్చిన అమరేశ్ అనే యువకుడు అకస్మాత్తుగా చాకుతో దాడి చేశాడు. వెంటనే అడ్డుకున్న చన్నబసవ అతన్ని పట్టుకునే ప్రయత్నం చేయగా వాహనం పై పారిపోయాడు. వెంటనే తన స్కూటర్ పై వెంబడించిన చన్నబసవ దాదాపు 10కి.మీ దూరం వెంబడించి ఇతరుల సహాయంతో నిందితుడిని అడ్డగించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇద్దరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. గాయాల పాలైన చన్నబసవను ఆస్పత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఇద్దరి మధ్య పొలం పంచాయతీ ఉండడం వల్లే గొడవ జరిగినట్లు గుర్తించారు. సైన్యంలో పని చేస్తున్న చన్నబసవ సోదరికి చెందిన పొలాన్ని నిందితుడు అమరేశ్ కొంతకాలంగా కబ్జాలో ఉంచుకోగా చన్నబసవ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి పొలాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య గతంలోనే రెండుసార్లు దాడి జరిగిందని పోలీసులు గుర్తించారు.

బళ్లారిలో ఓ మోస్తరు వర్షం



జలమయమైన రోడ్డు

బళ్లారిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో గంట పాటు వర్షం దంచి కొట్టింది. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి.

విజయోత్సవ సభకు మూడు లక్షల మంది

● కార్యకర్తలు తరలిరావాలి: మాజీ మంత్రి నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర

బళ్లారి సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభకు 3 లక్షల మంది తరలివస్తారని మాజీ మంత్రి నాగేంద్ర అన్నారు. హోస్పేట్ నగరంలోని పునీత్ రాజ్‌కుమార్ స్టేడియంలో జరగనున్న సాధన సదస్సు నేపథ్యంలో కౌల్‌బజార్‌లోని తమ నియోజకవర్గంలోని 11వార్డుల సభ్యులు, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య,డీసీఎం శివకుమార్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, లిడ్కర్ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజు, మానయ్య పాల్గొన్నారు.

బస్సుల వేళల్లో మార్పులు

బళ్లారి గాంధీనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈనెల 20న విజయనగర జిల్లా హొసపేట నగరంలో 'ప్రగతియత్త కర్నాటక సమర్పణ కంకల్ప' భారీ సమావేశం నిర్వహించనున్నారు. బళ్లారి విభాగం నుంచి మొత్తం225 బస్సులు జిల్లా పాలనా మండలి ఆదేశాల మేరకు ప్రతిరోజు సంచరించే బస్సుల వేళల్లో మార్పులు చేస్తున్నట్లు బళ్ళారి ఆర్టీసి డిపో కంట్రోలర్ తెలిపారు.

లక్ష పట్టాల పంపిణీకి సిద్ధం

విజయనగరం (హోస్పేట), ఏప్రిల్ 19 (ఆంధ్ర జ్యోతి) : ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సమావేశాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంబరాల ఏర్పాట్లను కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రకటించారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి మంత్రివర్గం ఐదు హామీ పథకాల అమలుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఐదు హామీ పథకాలు దశాల వారీగా విజయవంతంగా అమలు చేయబడ్డాయి. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక నమూనాగా నిలిచాయి. ఈ ప్రాజెక్టులు కులం, మతం లేదా భాషతో సంబంధం లేకుండా దేశంలోని ప్రజలందరి ఇళ్లకు చేరాయి. కర్ణాటక రాష్ట్ర ప్రగతి వైపు పయనిస్తోంది. ఈ చారిత్రాత్మక విజయాన్ని స్మరించుకునేందుకు ప్రభుత్వం మే 19న రెవెన్యూ శాఖ విజయనగరం జిల్లా యంత్రాంగం ద్వారా ప్రగతియత కర్ణాటక సమర్పణ సంకల్ప అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం రూ.లక్ష కుటుంబాలకు రెవెన్యూ గ్రామ హక్కుల పత్రాలను అందించడం ద్వారా ఉపశమనం కల్పిస్తోంది. హోస్పేట నగరంలోని జిల్లా స్టేడియంలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ లబ్ధిదారులకు హక్కుపత్రాలను పంపిణీ చేస్తారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సమావేశానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షత వహిస్తారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర ఆర్థిక కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్, భారీ పరిశ్రమలు, ఉక్కుమంత్రి కుమారస్వామి, వినియోగదారులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలి

● బరువు, పెరుగుదలలో సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలి: ఇంటింటి పర్యటనలో డీహెచ్‌ఓ రమేష్ బాబు

బళ్లారి గాంధీనగర్, మే 19(ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని, ఆరోగ్య రక్షణకు ప్రత్యేక బాల చైతన్య పిల్లల పోషణ పథకం క్రింద పిల్లల వైద్య నిపుణుల చేత పరీక్షలు చేయించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేష్ బాబు సూచించారు. సోమవారం తాలూకాలోని కొళగల్లు గ్రామంలో ఐదేళ్లలోపు పిల్లలు కలిగిన ఇంటి వద్దకు వెళ్ళి పిల్లల ఆరోగ్యంపై ఆయన ఆరా తీశారు. పుట్టిన శిశువు సహజంగా2.5కిలోలు ఉన్నపుడు ఆ శిశువు సామాన్య బరువుగా గుర్తించబడుతుందని, ఒకవేళ అంతకంటే తక్కువ ఉన్నట్లయి అవసరమైన చికిత్సను అందించాల్సి ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాల శిశు ఆరోగ్యం దృష్ట్యా 'బాలచైతన్య' కార్యక్రమంలో భాగంగా తాలూకా ఆసుపత్రి, సముదాయ ఆరోగ్య కేంద్రాల్లో పిల్లల వైద్య నిపుణుల ద్వారా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. సామాన్యంగా ఏడాది చిన్నారి 10కిలోలు, రెండు సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు 12కిలోలు, మూడు సంవత్సరాలు కలిగిన చిన్నారి 14, నాలుగు సంవత్సరాలకు 16కిలోలు, ఐదు సంవత్సరాలకు 18 కిలోలు ఉంటే సహజ ఆరోగ్యంగా ఉన్నట్లు భావించాలన్నారు. పిల్లల ఆరోగ్యంలో మార్పులు వస్తే, వారి పెరుగుదలపై ప్రభావం చూపుతుందని, ఆహారం తీసుకోవడంలో వెనకడుగు వేస్తుంటారని, తరచూ అనారోగ్యానికి గురవుతుంటారన్నారు. వయస్సు ఆధారంగా పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా పిల్లలను ఆరోగ్యవంతులుగా చేయడానికి పిల్లల తల్లితండ్రులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారంతో పాటు వైద్యుల సలహా మేరకు అవసరమైన టీకాలు వేయించి అంటు వ్యాధుల భారి నుంచి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దమనహళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాలనా వైద్యాధికారి డాక్టర్ దివ్య, జిల్లా ఆరోగ్య శిక్షణాధఖకారి ఈశ్వర హెచ్.దానప్ప, డీఎస్‌ఓ గిరీష్, ఐసీడీఎస్ పరిశీలకులు కళ్యాణమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, గ్రామ పాలనా మండలి అధికారి మంజునాథ్, సముదాయ ఆరోగ్య అధికారి ఎర్రిస్వామి, అంగవాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కొళగల్లు గ్రామంలో తల్లిదండ్రులకు సూచనలిస్తున్న డీహెచ్‌ఓ



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు

కాంగ్రెస్ పాలనలో దుస్థితిలోకి రాష్ట్రం

● ప్రజాసంక్షేమం పట్టని నాయకులు: బీజేపీ అధ్యక్షుడు జిల్లా అనిల్

బళ్లారి సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ కన్నడిగుల జీవితాలకు శాపంగా మారి రాష్ట్రాన్ని దుస్థితిలోకి నెట్టిందని, ఇది పరిపాలించే ప్రభుత్వం కాదు ఇది రికవరీ ప్రభుత్వమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు మండిపడ్డారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిప్రాజెక్టులోనూ, ప్రతి టెండర్‌లోనూ కమిషన్ దందా జరగుతోందన్నారు. రాష్ట్రంలో దోచుకున్న కోట్లాది రుపాయల డబ్బును పార్టీ హైకమాండ్‌కు, ఇతర రాష్ట్రాల ఎన్నికలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. వాల్మీకి కార్పొరేషన్ నుంచి జరిగిన రూ. 187కోట్లు దోపీడీ షెడ్యూల్ట్ తెగ సమాజానికి చేసిన మోసం, స్మార్ట్ మీటర్ల పేరుతో రూ. 15,568 కోట్ల కంభకోణం జరిగిందన్నారు. బాల కార్మికులకు పోషకాహార కిట్ల కొనుగోలుతో రూ.75కోట్ల భారీ కుంభకోణానికి ప్రత్యక్షంగా బాధ్యత వహించారు కార్మిక మంత్రి సంతోష్‌లాడ్. విధాన సభలోనే పాకిస్తాన్ జిందాబాద్ వంటి దేశ వ్యతిరేక నినాదాలు వినిపిస్తున్నప్పటికీ ప్రభుత్వం దానిని దాచడానికి ప్రయత్నిస్తూ దేశ వ్యతిరేకుకుల మద్దతు ఇస్తోందన్నారు. ఇది ముస్లింలను సంతృప్తి పరచడానికి చేసిన హలాల్ బడ్జెట్ మాత్రమే. హిందువుల పన్నుల డబ్బును వక్ఫ్ ,ఉర్దూ పాఠశాలలు, ఇమామ్‌లకు కోట్ల కోట్ల గ్రాంట్లకు, మైనారిటీ కాలనీల అభివృద్ధికి వేల కోట్లను వారిని సంతృప్తి పరచడానికి ఖర్చుచేస్తున్నారు. ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో కూడా హిందువులకు అన్యాయం జరగుతోంది. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు అమలు చేసి వివక్ష చూపారు. హిందూ రైతుల ఆస్తులపై అక్రమ నోటీసులు జారీ చేయడానికి వక్ఫ్ బోర్డు సహాయపడింది. విలేకరుల సమావేశంలో పార్టీనాయకులు ఎస్.గురులింగనగౌడ, డాక్టర్ బికే.సుందర్ ,డాక్టర్ అరుణ కామినేని,ఆర్ మల్లేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నదిలో పడి బాలుడి మృతి



గౌతమ్ మృతదేహం

కంప్లి, మే19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తుంగభద్ర నదిలో పడి బాలుడు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం హోసళ్లి గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు వివాహం పందిరి ఆకులను నదిలో వేసేందుకు వచ్చారు. తుంగభద్ర నదిలో చిక్కజంతగల్ వైపున ట్రాక్టర్‌లో ఉన్న పెళ్లిపందిరి ఆకులను నదిలో వేశారు. అనంతరం నదిలో స్నానం చేయడానికి వెళ్లారు. అందులో నుంచి ఇద్దరు బయటకు వచ్చారు. గౌతమ్ (14) బయటకి రాకపోయేసరికి ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలించి బాలుడి మృతదేహాన్ని వెలుపలికి తీశారు. బాలుడి మృతితో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

ప్రజల రుణం తీర్చుకోవడానికే సంబరాలు

● ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్



బైక్‌ర్యాలీలో డీసీఎం డీకే శివకుమార్, మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్

బళ్లారి సిటీ,మే 19(ఆంధ్రజ్యోతి): వేడుక ముఖ్యం కాదు పేదలకు సహాయం చేయడం ద్వారా ఉపశమనం కలుగుతుందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పూర్తి చేసుకున్న నేపథ్యంలో పంచగ్యారంటీ అమలు ఆనందాన్ని పంచుకునేందుకు, 1.11లక్షల టైటిల్ డీడ్‌లను పేదలకు అంకితం చేయడానికి మంగళవారం హొసపేటలోని పునీత్ రాజ్‌కుమార్ జిల్లాస్టేడియంలో అంకితభావ సమావేశం జరగనుంది. పేదలకు సహాయం చేశామనే సంతృప్తితో సమావేశమవుతున్నాము. ప్రజలకు మా రుణం తీర్చుకున్నందుకు సంతోషంగా ఉన్నామన్నారు. నగర ప్రజలకు అంకితోత్సవ కార్యక్రమం గురించి తెలియజేయడానికి హొసపేటలో బైక్‌ర్యాలీ చేపట్టారు. జిల్లాఇన్‌చార్జిమంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ జెండా ఊపి బైక్‌ర్యాలీని ప్రారంభించారు. స్వయంగా వారు ద్విచక్రవాహనాన్ని నడిపారు. ఎమ్మెల్యే గవియప్ప,సహా పలువురు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు


బళ్లారిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ తాలుకాలోని మోకా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రూప నేతృత్వంలో చిన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఆరోగ్య పరీక్షల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లే బాలింతలు ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలు ఉన్న తల్లులకు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సలహా సూచనలు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రూప

కప్పగల్లు రస్తాకు మాజీ మంత్రి ముండ్లూరు పేరు

● నగరసభ పాలికె సమావేశంలో తీర్మానం



మాజీ మంత్రి ముండ్లూరు (ఫైల్)

బళ్లారి, మే 19 (ఆంధ్రజ్యోతి): బళ్లారి లోని ప్రస్తుతం ఉన్న కప్పగల్లు రస్తాకు మాజీ మంత్రి ముండ్లూరు రామప్ప పేరు పెట్టాలని నగర పాలికె సర్వసభ్య సమావేశంలో తీర్మాణం చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ముందుగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ప్రస్తావన తెచ్చారు. ముండ్లూరు రామప్ప డి.ఎస్ బంగారప్ప ముఖ్యమంత్రి ఉన్న కాలంలో ముండ్లూరు రామప్పఇంధన శాఖ మంత్రిగా పనిచేశారు. అంతే కాకుండా అనేక దపాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే మంత్రిగా పనిచేశారు. ముండ్లూరు అంజినప్ప, ముండ్లూరు వెంకటమ్మ దంపతులకు జన్మించిన ముండ్లూరు రామప్ప తల్లిదండ్రుల పేరును చిరస్థాయిగా బళ్లారిలో నిలుపుకున్నారు. అయన బళ్లారి అనేక సేవా కార్యక్రమాలు , అభివృద్ధి పనులు చేశారని ఎమ్మెల్యే భరత్‌రెడ్డి వివరించారు. ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ప్రతిపాదించగా సభలో అందరూ ఏకగ్రీవంగా అమోదం తెలిపారు. ఈసమావేశం లో మేయర్ ముల్లంగి నందీష్ బాబు ఎంపీ నసీర్ హుసేన్, ఎమ్మెల్యే నాగేంద్ర, ఉప మేయర్ డి. సుకుం. వార్డు సభ్యులు ముండ్లూరు ప్రభంజన్, మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు తదితర కార్పొరేట్లు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీ నాసిర్ హుసేన్, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

హోసూరు జోన్

అన్నాడీఎంకేలోకి వందలాదిమంది చేరిక



కార్యకర్తలతో మునుస్వామి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని శూలగిరిలో తిమ్మరాజయ్ నాయకత్వంలో ఇతర పార్టీలనుంచి వచ్చిన వారు వందలాదిమంది అన్నాడీఎంకే పార్టీలోకి చేరారు. 1800మందికిపైగా పార్టీలో చేరినట్టు తెలుస్తోంది. అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునుస్వామి, కృష్ణగిరి పశ్చిమజిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి పాల్గొని అందరికీ పార్టీ తలపాగాలతో స్వాగతించారు. అన్నాడీఎంకే పాలనలో సాధించిన విజయాలు, ప్రణాళికల గురించి వివరించారు. ప్రతి సభ్యుడు పార్టీ పురోగతికి సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు. కేశవన్, మునికృష్ణన్, వేణుమ్, శివకుమార్, రంగనాథ్, వెంకటేశ్, లక్ష్మీనారాయణ, జయరామన్, బాలచంద్రన్, హరీశ్, చిత్రరాజ్, రఘుపతి, ముత్తుమణి, సంతోష్ తిమ్మాయస్వామి, శివశంకర్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరులో భారీ వర్షం

హోసూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): హోసూరులో కొన్ని రోజులుగా సాయంత్రం, రాత్రి వేళల్లో వర్షం కురుస్తోంది. ఇందులో భాగంగా సోమవారం కూడా గంటకుపైబా భారీ వర్షం కురిసింది. వరుస వర్షాలతో ఎండలనుంచి కొంత ఉపశమనం లభించిందని ప్రజలు అభిప్రాయపడ్డారు. ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. మరోవైపు చెరువులు, డ్యామ్‌లకు క్రమేపీ నీరు చేరుతుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జలమయమైన ప్రధాన రహదారి



డ్యామ్ నుంచి వెలువడుతున్న నీరు

కెలవరపల్లి డ్యామ్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

హోసూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలో నిరంతరంగా కురుస్తున్న వర్షాలతో తెన్‌పెన్నై నదికి అనుబంధమైన కెలవరపల్లి డ్యామ్‌లోకి ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం 904 క్యూసెక్కులకు చేరింది. డ్యామ్ సామర్థ్యం 44.28 అడుగులు కాగా ప్రస్తుతం 41.98 అడుగులుగా ఉంది. తాజాగా డ్యామ్ నుంచి 794 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా రసాయన వ్యర్థాల కారణంగా నురగ ఎక్కువగా వెలువడుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): ఏపీలో కొత్తరేషన్ కా ర్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సచివా లయాల ద్వారా పౌరసరఫరాల శాఖకు సంబం ధించిన ఏడు రకాల సేవలను ఈనెల ఏడో తేదీ నుంచి ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తకార్డులు అరకొరగా పంపిణీ చేసి సరిపెట్టుకుంది. పైగా కొత్తకార్డులు తీసుకోవడానికి పలు షరతులు విధించింది. వీటికి పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామసచివాలయాల ద్వారా సులభంగా రేషన్ కార్డులు, కార్డులో సభ్యుల చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకు న్న వారికి జూన్‌లో కొత్త కార్డులు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో అర్హత కలిగిన పేద వారు కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకో వచ్చు. కార్డులో సవరణలు చేసుకోవచ్చని కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

● క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు

ఈ సారి అర్హులైన వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్‌కార్డులు అందజేయనున్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే కుటుంబంలో ఉండే సభ్యుల వివరాలతో పాటు అరు నెలల నుంచి వారు తీసుకున్న సరుకుల వివరాలు తెలుస్తాయి. జిల్లాలో 5,66,189 రేషన్ కార్డులున్నాయి. ఇందులో ఇంకా 99,972 మందికి ఈ-కేవైసీ పూర్తికాలేదు. వారంతా ఈకేవైసీ పూర్తి చేసుకు నేందుకు జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు.

● సేవలు ఇవే..

కొత్తకార్డులు పొందవచ్చు, బియ్యం కార్డులో సభ్యుల చేర్పులు, సభ్యుల విభజన, మరణించిన సభ్యులపేర్ల తొలగింపు, కార్డుల సరెండర్, చిరునామా మార్పు, తప్పుగా నమోదైనా ఆధార్ సీడింగ్ దిద్దుబాటు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయి.